www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 15 మే 2025

5

ఏలూరు



ఏలూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కొద్దిపాటి సమయంలోనే భారీ వర్షం కురవడంతో రోడ్లపైకి మోకాళ్ల లోతు నీరు చేరింది. ఏలూరులోని ఆర్ఆర్‌పేట ప్రధాన రహదారి, పవర్‌పేట స్టేషన్ రోడ్డు మొత్తం జలమయమయ్యాయి. వన్‌టౌన్ ప్రాంతం మొత్తం నీటితో మునిగిపోయాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొద్దిసేపటికి వర్షం ఆగిపోయి ఎండ రావడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఇదేం విద్యా విధానం..!



- గత వైసిపి ప్రభుత్వంలో ఆరు రకాలు.. ఇప్పుడు 9 రకాల స్కూళ్లు
- ఉమ్మడి పశ్చిమలో 2,921 స్కూళ్లకుగాను బేసిక్ స్కూళ్లే 2,341
- తెలుగు మీడియంను పూర్తిగా ఎత్తేసిన కూటమి ప్రభుత్వం
- 1 నుంచి 8వ తరగతి వరకూ తెలుగు పోస్టు లేని వైనం
- ఇప్పటి వరకూ తెలుగులో చదివిన విద్యార్థుల పరిస్థితి అయోమయం
- డ్రాపవుట్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని విద్యావేత్తల ఆందోళన
- స్కూళ్ల క్రమబద్ధీకరణలో కొత్తగా 35 స్కూళ్లు మూత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తొమ్మిది రకాల స్కూళ్ల విద్యావిధానంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో ఆరు రకాల స్కూళ్ల అమలు చేయగా, కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి తొమ్మిది రకాల స్కూల్స్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వం చేపట్టిన స్కూళ్ల క్రమబద్ధీకరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తగా 39 స్కూళ్లు మూతపడనున్నాయి. స్కూళ్లు మూసివేస్తూ అద్భుతమైన విద్యావిధానం తెచ్చినట్లు ప్రభుత్వం చెప్పడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కాకుండాపోయింది. గత ప్రభుత్వం తెలుగు మీడియంలో విద్యా బోధనపై ఆంక్షలు విధించడంపై అప్పట్లో కూటమి నేతలు పవన్‌కల్యాణ్, లోకేష్ తదితరులు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా దీనిపై అప్పట్లో పెద్దదుమారమే రేగింది. ప్రాథమిక విద్య తెలుగులోనే జరగాలనే నినాదం అప్పట్లో మార్మోగింది. తాము వస్తే తెలుగు మీడియంలోనే ప్రాథమిక విద్య కొనసాగుతుందని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం తెచ్చిన విద్యావిధానంలో పూర్తిగా తెలుగు మీడియంను ఎత్తివేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సైతం తీసేయడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. నిన్నటి వరకూ తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియంలోకి మారడం అత్యంత కష్టమైన పని అని చెప్పొచ్చు. దీంతో విద్యార్థుల డ్రాపవుట్ల సంఖ్య పెద్దఎత్తున ఉంటుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇది ఒకరకంగా పేద పిల్లలకు విద్యను దూరం చేయడమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యావిధానంలో కూటమి ప్రభుత్వం తెచ్చిన మార్పులపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతోపాటు విద్యావేత్తలు సైతం తీవ్రంగా తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన తొమ్మిది రకాల స్కూళ్ల విధానంలో బేసిక్ స్కూళ్లే అత్యధికంగా ఉన్నాయి. ఇక్కడ 20 మంది వరకూ ఒక టీచర్ ఆ తర్వాత 60 మంది వరకూ ఇద్దరు టీచర్ల కేటాయింపుపైనా చర్చ సాగుతోంది. భవిష్యత్తులో ఈ స్కూళ్లన్నీ మూతపడే పరిస్థితి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పేద పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యావిధానంలో మార్పులతో ఇక నుంచి తొమ్మిది రకాల స్కూళ్లు అమల్లోకి రానున్నాయి.

తొమ్మిది రకాల స్కూళ్లు ఇలా

ప్రభుత్వం రూపొందించిన తొమ్మిది రకాల స్కూళ్ల విధానంలో మొదటిది శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్. ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటర్ కంటే ఎక్కువ దూరంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను ఈ పేరుతో పిలుస్తారు. ఇవి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్కటి కూడా లేనట్లుగా గుర్తించారు. రెండోది ఫౌండేషన్ స్కూళ్లు. వీటిలో ప్రీప్రైమరీ-1, 2తోపాటు 1, 2 తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 315 వరకూ ఏర్పాటవుతున్నాయి. మూడోది బేసిక్ ప్రైమరీ స్కూళ్లు. వీటిలో ప్రీప్రైమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉంటాయి. ఇవి జిల్లాలో 1,508 వరకూ ఉండనున్నాయి. నాలుగోది మోడల్ ప్రైమరీ స్కూళ్లు. ఈ విధానంలో ప్రీప్రైమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 528 ఉండనున్నాయి. ఐదో రకం ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రైమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఎనిమిది తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 84 ఉన్నాయి. ఆరో రకం హైస్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి వరకూ ఉంటాయి. ఇవి జిల్లాలో 391 ఉండనున్నాయి. ఏడో విధానం హైస్కూళ్లలో ఒకటి నుంచి పది వరకూ తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 41 ఉన్నాయి. ఎనిమిది, తొమ్మిది రకాల్లో హైస్కూల్ ప్లస్, ఆరు నుంచి 12 తరగతులు, ఒకటి నుంచి 12 తరగతులు ఉండనున్నాయి. ఇవి జిల్లాలో 54 వరకూ ఉండనున్నాయి. మొత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2,921 స్కూళ్లు కొనసాగనుండగా అందులో 2,341 బేసిక్ స్కూళ్లు ఉండటం గమనార్హం.

కొత్త విద్యావిధానంలో ఉమ్మడి పశ్చిమలో స్కూళ్లు ఇలా..

శాటిలైట్ స్కూళ్లు: 0
ఫౌండేషన్ స్కూళ్లు: 315
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు: 1,508
మోడల్ ప్రైమరీ స్కూళ్లు: 528
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు: 84
హైస్కూళ్లు: 391
హైస్కూళ్లు బిఏన్ (1-10 అండ్ 1-12): 41
హైస్కూళ్లు ఎంపిఎన్ (1-10 అండ్ 1-12): 54
మొత్తం స్కూళ్లు: 2,921

కొత్త విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

బొరగం రెడ్డిదొర, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గత ప్రభుత్వం ఆరు రకాల స్కూళ్ల తెచ్చినప్పుడు పది లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. ఇప్పుడు తొమ్మిది రకాల స్కూళ్లు తేవడంతో పేద విద్యార్థులు పూర్తిగా విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. విద్యార్థులను బట్టి ఉపాధ్యాయుల నిష్పత్తికి బదులు స్కూళ్లను బట్టి నిష్పత్తి విధించారు. జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు చట్ట ప్రకారం మాతృభాషలో విద్యాబోధన జరగాలి. తెలుగు మీడియంను తొలగించడం దారుణం. నీట్, జెఇఇ వంటి పోటీ పరీక్షలు సైతం మాతృభాషలో రాసే అవకాశం ఉండగా ఇక్కడ ఈ విధంగా చేయడం ఏమాత్రం మంచిది కాదు.

పాత విధానాన్ని రూపం మార్చి అమలు

కె.బెనెన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

గత ప్రభుత్వం అవలంభించిన విధానాన్నే రూపం మార్చి అమల్లోకి తెస్తున్నారు. ఈ విధానంతో ప్రయివేటు స్కూళ్లకు మరింత మేలు జరుగుతుంది. కొత్తగా తెస్తున్న విద్యా విధానంలో అనేక లోపాలు ఉన్నాయి. విద్యార్థుల డ్రాపవుట్లు పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థుల నిష్పత్తిని బట్టి ఉపాధ్యాయులను నియమించాలి

ఆర్.రవికుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కొత్తగా అమల్లోకి తెస్తున్న విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బేసిక్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను బట్టి కాకుండా స్కూళ్లను బట్టి ఉపాధ్యాయుల నిష్పత్తి విధించడం దారుణం. తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ కొనసాగించాల్సి ఉండగా తెలుగు మీడియంను పూర్తిగా తొలగించారు. స్కూల్ అసిస్టెంట్లను ప్రయిమరీ స్కూళ్లలోకి కిందకు తీసుకొచ్చారు. హైస్కూళ్లలో సెక్షన్‌కు 45 మంది విద్యార్థులు ఉండాలని చెబుతుండగా 53 మందిని తెస్తున్నారు. కొత్త విద్యావిధానంలో అనేక లోపాలు ఉన్నాయి.

వైద్యుల నిర్లక్ష్యానికి నిండు గర్భిణి మృతి..!

పోలవరం సిహెచ్‌సిలో ఘటన

ప్రాథమిక విచారణలో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని నిర్ధారణ

పూర్తిస్థాయి విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - పోలవరం


వైద్య సిబ్బంది నిలువెత్తు నిర్లక్ష్యం వల్ల ఒక నిండు గర్భిణి కడుపులో బిడ్డతో సహా మృతి చెందింది. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై సిపిఎం, ప్రజాసంఘాలు పదేపదే హెచ్చరిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోని ఫలితంగా రెండు ప్రాణాలు ఊపిరిదొలినట్లయ్యింది. ఈ విషాదకర ఘటన పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పోలవరం మండలం జిలేళ్లగూడెం పంచాయతీ కొత్త కుంకాల గ్రామానికి చెందిన తామా శిరీష (25) తొమ్మిది నెలల నిండు గర్భిణి. ఆమె పురిటినొప్పులు రావడంతో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రంలో చేరింది. గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించారు. బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో శిరీషా పరిస్థితి విషమంగా ఉందని, రాజమండ్రి తీసుకెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. దీంతో ఆమెను హుటాహుటీన 108 అంబులెన్స్‌లో రాజమండ్రి తరలించేందుకు సిద్ధమవుతుండగా ఆస్పత్రి గేటు వద్దకు వచ్చేసరికి శిరీషా మృతి చెందింది. సకాలంలో సరైన చికిత్స అందకపోవడం ఫలితంగానే తన భార్య మృతి చెందిందని శిరీషా భర్త భూచంద్రం, బంధువులు ఆరోపించారు. మృతురాలికి రెండేళ్ల పాప ఉంది. దీనిపై గైనకాలజిస్ట్ విష్ణువర్ధినిని వివరణ కోరగా రెండేళ్ల క్రితం మృతురాలికి సిజేరియన్ జరిగిందని, అప్పటి కుట్లు మానకపోవడం, వెంటనే మళ్లీ గర్భం దాల్చడంతో గర్భసంచికి వేసిన కుట్లు విడిపోయి అంతర్గత రక్తస్రావం జరగి శిరీషా మృతి చెందిందని తెలిపారు. గర్భిణి మృతి విషయం తెలియగానే కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటిడిఎ పిఒ రాములునాయక్ పోలవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యాధికారులను విచారించారు. రాజమండ్రి డిసిహెచ్‌ఎస్ పద్మావతి నేతృత్వంలో నలుగురు కమిటీ సభ్యుల బృందం ఆసుపత్రికి చేరుకుని వైద్యులను, సిబ్బందిని, మృతురాలి బంధువులను విచారించారు. ఈ సందర్భంగా ఏలూరు డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ మాట్లాడుతూ గిరిజన గర్భిణి మృతికి డ్యూటీ డాక్టర్, ప్రసూతి వైద్య నిపుణులు సకాలంలో స్పందించకపోవడం వల్లే జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

బుట్టాయగూడెం సిహెచ్‌సిలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తనిఖీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు వైద్య సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పటల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆసుపత్రిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోలవరం సిహెచ్‌సిలో గిరిజన గర్భిణి మృతి చెందడం వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉందన్నారు. డ్యూటీ డాక్టర్లు, సూపరింటెండెంట్ ఆసుపత్రిలో లేకుండా పోవడం బాధాకరమన్నారు. దీనిపై వైద్యఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లానని, ఇప్పటికే ముగ్గురు వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని తెలిపారు. డాక్టర్ సునీల్, డాక్టర్ రాంబాబు, గైనకాలజిస్టు డాక్టర్ విష్ణువర్ధినిలకు నోటీసులిచ్చినట్లు వివరించారు. పోలవరం ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలందించడంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేదని, కారకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

ప్రజాశక్తి - ముసునూరు

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని, తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌భాషా అన్నారు. బుధవారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె. సూరిబాబు ఆధ్వర్యంలో మట్టి నమూనాలను సేకరించారు. అనంతరం సచివాలయం నందు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం, నిల్వలు ఎక్కువగా ఉండటం వలన రసాయనిక ఎరువులు వాడినట్లయితే భూమిలో కొన్ని పోషక విలువలు తగ్గి, దిగుబడి తగ్గిపోయే పరిస్థితి ఉందని. అదే కత్రిమ, సేంద్రియ ఎరువులు వాడకం వాడినట్లయితే భూమికి, రైతులకు మేలు చేకూర్చినట్లు అవుతుందని, అదేవిధంగా భూమిలో మట్టి నమూనాలను సేకరించి పరిశీలించి అప్పుడు ఏయే ఎరువులు వాడకం వలన పంటలో అధిక దిగుబడిని పొందవచ్చునని తెలుసుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏవో సూరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని 16 గ్రామాల్లో 600 మట్టి నమూనాలను సేకరించటం జరిగిందని, ఇంకా 600 నమూనాలు సేకరించవలసివుందని, మండలంలో 1200 మట్టి నమూనాలను టార్గెట్ గా ఇచ్చారని తెలిపారు. కావున ప్రతి ఒక్క రైతు తమ పోలంలోని మట్టిను సేకరించి వ్యవసాయ శాఖ, సచివాలయ శాఖ సిబ్బంది ద్వారా తమకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మలి బాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంపెక్టర్ వాహనం ప్రారంభం

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

మేయర్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.46 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన మీడియం సైజ్ కంపెక్టర్ వాహనాన్ని మేయర్ నూర్జహాన్ పెదబాబు జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నూతనంగా కొనుగోలు చేసిన కంపెక్టర్ మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపరిచే చర్యల్లో భాగంగా సర్కిల్స్ వారీగా అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ రకాల నిధులతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.46 లక్షలతో మీడియం సైజ్ కంపెక్టర్ కొనుగోలు చేసి ప్రారంభించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 50 డివిజన్లలో 16 సర్కిల్స్‌లో ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్‌కి తరలించడానికి 17 ట్రాక్టర్లు, 8 కంపెక్టర్లు ఉపయోగిస్తున్నామన్నారు. డోర్ కలెక్షన్‌కు సంబంధించి సరిపడా సిబ్బంది వారికి సరిపడా పుష్ కార్ట్స్, డస్ట్‌బిన్స్, డంపర్ బాక్సులు ఉన్నాయని మేయర్ తెలిపారు. శానిటేషన్ విషయంలో ప్రజల నుండి పూర్తి సహకారం ఉండాలని, డోర్ కలెక్షన్‌కు వచ్చిన శానిటేషన్ సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా అందించాలని మేయర్ నగర ప్రజలను కోరారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భాను ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్తపన్ను వసూలు చేయడం మానేశామన్నారు. అయితే అప్పుడు ఉపయోగించిన క్లాప్ వాహనాల కారణంగా నెలకు రూ.40 లక్షలు అధికంగా మున్సిపల్ కార్పొరేషన్‌కు భారమవుతుందన్నారు. అందువల్ల క్లాప్ వెహికల్స్ ఆపేసామన్నారు. వాటి స్థానంలో మున్సిపల్ కార్పొరేషన్‌కి సంబంధించిన ఆర్థిక సంఘం నిధులతో 15 కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రతిరోజు నగర్ కార్పొరేషన్‌కు వచ్చే 103 టన్నుల చెత్తను మనకు ఉన్న కంపెక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు రెండు ట్రిప్పులు తరలించడం జరుగుతుందన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభితో మాట్లాడి ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా ఆచెత్తను అక్టోబర్ 2వ తేదీ నాటికి క్లియర్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ మేయర్ వందనాల దుర్గ భవాని శ్రీనివాస్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్

చావులోనూ వీడని స్నేహం..!

ప్రమాదవశాత్తూ కోమటికుంట చెరువులో మునిగి ముగ్గురు దుర్మరణం

మృతులు పెదవేగి మండలం వేగివాడ వాసులు

చిన్నలింగంపాడు ఫంక్షన్‌కు వచ్చి వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి - భీమడోలు, ఉంగుటూరు


వారంతా మిత్రులు. శుభకార్యంలో పాల్గొనేందుకు వచ్చారు. సరదాగా గడిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో ఒక మిత్రుడు జారిపడిపోగా అతన్ని రక్షించేందుకు గట్టునున్న మిగిలిన మిత్రులు సాయం అందించే క్రమంలో మరో ఇద్దరు అదే చెరువులో మునిగి విగత జీవులుగా తేలారు. దీంతో శుభకార్యం ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. దీనికి సంబంధించి భీమడోలు సిఐ ఎంజె.విల్సన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం వేగివాడకు చెందిన నేతల అజయ్ అలియాస్ కెనడాం (30), నేతల సాగర్ అలియాస్ నాని (23), చొక్కా అభిలాష్ (22), నున్న ప్రవీణ్, నేతల ఆనంద హర్ష ఐదుగురూ మిత్రులు. వీరంతా బుధవారం మండల కేంద్రమైన భీమడోలు పంచాయతీ పరిధిలోని చిన్న లింగంపాడు ప్రాంతంలో ఒక ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చారు. మధ్యాహ్న సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కోమటికుంట చెరువు వద్దకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో అజయ్, సాగర్, అభిలాష్ చెరువు లోకి జారిపడిపోయారు. మిగిలిన ఇద్దరు వారిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. విషయం తెలుసుకున్న భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్, ఎఎస్ఐ చలపతిరావు, సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ముగ్గురిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వారు మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుల్లో నేతల అజయ్‌కు వివాహమైంది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మిగిలిన ఇద్దరికి వివాహాలు కాలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెరువులో గాలిస్తున్న స్థానికులు, పోలీసు సిబ్బంది

20న ఉపాధి హామీ పనులు బంద్ చేయాలి

ఎపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి



పెదవేగి: మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - పెదవేగి

ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఉపాధి హామీ పనులు బంద్ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. వ్యకాస బృందం బుధవారం విజయరాయిలోని ఉపాధి కార్మికులను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుంది. పేదలకు, గ్రామీణ పేదలకు పట్టెడన్న పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. వేతన బకాయిలు ఇవ్వకపోవడం, నిధులు తగ్గించడం, పనిముట్లు ఇవ్వకపోవడం, వంద రోజులు పనులు కల్పించకపోవడం తదితర రూపాల్లో చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంద న్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు చూపాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, రూ.600 వేతనం చెల్లించాలని, అడిగిన వారందరికీ జాబ్‌కార్డ్, పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐదు వారాలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు వాపోయారు. తక్షణం ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు అస్కర అప్పలస్వామి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. నెలలు తరబడి వేతనాలు ఇవ్వకపోతే రెక్కల కష్టంపై ఆధారపడి జీవించేవారు ఏరకంగా బతుకుతారనే కనీస ఆలోచన కూడా ప్రభుత్వానికీ లేకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు రౌతు ఎల్లమ్మ, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధానాలను విడనాడకపోతే ప్రతిఘటన తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. బావాయిపాలెం, క్రొవ్విడి, సిద్దాపురం, శ్రీరామపురం గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు ఆయన వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు కూడా పనులు బంద్ చేసి పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మేట్లు రమాదేవి, శ్రీను రాజు, శ్రీదేవి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిడమర్రు: మాట్లాడుతున్న సత్యనారాయణ

ఏజెన్సీలను టెండర్ విధానం ద్వారా ఎంపిక చేయాలి

ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.గోపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో ఆటో, రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల తయారీ ఏజెన్సీలను టెండర్ విధానం ద్వారా ఎంపిక చేయాలని జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి జె.గోపి డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావుకు సిఐటియు నాయకులు బి.త్రినాథ్‌తో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఏలూరు నగర పరిసర గ్రామాల నుంచి దాదాపు ఐదు వేల మంది ఆటో రిక్షా డ్రైవర్లు ప్రయాణికులకు సేవలందిస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. గత మంగళవారం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను ప్రతి ఒక్కరు విధిగా తీసుకోవాలని ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు వివరణాత్మకంగా తెలియజేయడాన్ని సిఐటియు స్వాగతిస్తుందన్నారు. ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు ఉండటం వల్ల ప్రయాణికుల భద్రత, నేరాల శాతాన్ని తగ్గించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని, దీనికి సిఐటియు హృదయపూర్వకంగా సహకరిస్తుందని తెలియజేశారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల తయారీదారులను టెండర్ విధానంలో ఎంపిక చేసి అధునాతన సాంకేతికత, తక్కువ ధరకు అందించేలా ఏజెన్సీలను ఎంపిక చేయాలని కోరారు. మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఏకపక్షంగా డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల ఏజెన్సీ వ్యక్తులను ఆటో డ్రైవర్లకు పరిచయం చేయడం సహేతుకమైన చర్య కాదని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాల ఆటో స్టాండ్‌లను అన్నిటిని యూనియన్లుగా గుర్తించాలని కోరారు.



వినతిని అందజేస్తున్న నాయకులు

పొరుగు సేవల సిబ్బంది తొలగింపు

నూజివీడు టౌన్ : మండలంలోని సుంకొల్లు గ్రామంలో గృహనిర్మాణ లబ్ధిదారులకు అందవలసిన సామగ్రి పక్కదారి పట్టిందని వచ్చిన ఆరోపణలపై మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు అధికారులు దర్యాప్తు జరిపారు. 2,450 బస్తాల సిమెంటు, 11,952 కిలోల స్టీలు లబ్ధిదారులకు అందలేదని, వీటి విలువ రూ.16,52,895లుగా ధ్రువీకరించి గృహనిర్మాణ సంస్థ గోదాముల నుంచి సామగ్రి విడుదల చేసిన ఐదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశించారు. వారి నుంచి ఈ మొత్తం రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశించారని గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి జివివి.సత్యనారాయణ తెలిపారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు.


సిబిఎస్‌సి ఫలితాల్లో మోక్షజ్ఞ ప్రతిభ

ఏలూరు: సిబిఎస్‌సి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏలూరుకు చెందిన వై.మోక్షజ్ఞ ప్రతిభ కనబరిచాడు. ఏలూరు జిల్లా అదనపు సెషన్స్ జడ్జి డాక్టర్ వై.శ్రీనివాసరావు కుమారుడు మోక్షజ్ఞకు ఇంగ్లీష్‌లో 96, తెలుగులో 80, గణితంలో 71, సామాజిక శాస్త్రంలో 82, సమాచార సాంకేతికతలో 86 మార్కులు లభించాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను అత్యధిక మార్కులు సాధించినట్లు మోక్షజ్ఞ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : ఓవైపు ఆర్థిక ఇబ్బందులు.. మరోవైపు బ్యాంక్ అధికారుల ఒత్తిడితో మనస్థాపానికి గురైన ఆటో డ్రైవర్ బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి గ్రామానికి చెందిన నంబూరు అశోక్ కుమార్(37) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో అతను సొంత ఇంటిని కట్టుకోవాలన్న కలను నెరవేర్చుకునేందుకు ఓ అడుగు ముందుకు వేశాడు. ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకులో అప్పు చేసాడు. ఆర్థిక ఇబ్బందులతో చాలాకాలంగా బ్యాంకుకు కట్టాల్సిన అప్పు తిరిగి చెల్లించటంలో విఫలమయ్యాడు. అప్పు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు ఒత్తిడి తెచ్చారు. దీంతో బుధవారం అతని ఇంటి వద్దనే ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రాన్సిస్ కుటుంబానికి పరామర్శ


నివాళిఅర్పిస్తున్న బి.బలరాం, నాయకులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.ఫ్రాన్సిస్ తల్లి అందుగుల ముక్కమ్మ ఈనెల 4వ తేదీన మరణించారు. ఈమేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి, సిఐటియు నాయకులు పి.సూర్యారావు, గ్రామ పెద్దలు టి.రాజు, బి.డేవిడ్ రాజ్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం
కొయ్యలగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సెంటర్స్ డాక్టర్ బి.సతీష్ పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు పడకల ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా మార్చడానికి ఉన్న వనరులు, అవకాశాలను పరిశీలించడానికి తాను వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆసుపత్రిలో నెలకొన్న ఇతర సమస్యల గురించి కూడా ఆయన ఆరా తీశారు. గతంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉండేదని, తరువాత వివిధ కారణాల వల్ల డిగ్రేడ్ చేసినట్టు ఇక్కడి అధికారులు తెలిపారు. అప్ గ్రేడ్ చేయడానికిగల అవకాశాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు.

డిసిజిబి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్నికి అభినందన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులను డిసిజిబి ఛైర్మన్, రాష్ట్ర ఆప్కాబ్ ఛైర్మన్‌గా నియమించబడిన సందర్భంగా బుధవారం జంగారెడ్డిగూడెం టిడిపి నాయకులు కలిసి ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రాజన్న పండు, చిట్రోజి తాతాజీ, శీను ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరావు పాల్గొన్నారు.
ముదినేపల్లి : రాష్ట్ర ఆప్కాబ్ ఛైర్మన్, జిల్లా డిసిసిబి ఛైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులను బుధవారం ముదినేపల్లి మండల టిడిపి నాయకులు ఏలూరులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నియోజవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, నియోజకవర్గ కోకన్వీనర్ కొడాలి వినోద్, పోసిన పాండురంగారావు, చలసాని జగన్మోహన్‌రావు ఉన్నారు.

చెక్కపల్లి టిడిపి గ్రామ అధ్యక్షులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ముసునూరు
మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన టిడిపి కమిటీ అధ్యక్షులుగా కాటేపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించినట్లు టిడిపి పరిశీలకులు నక్కన బోయిన వేణు అన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మామిడిశెట్టిగిరిబాబు, ప్రధాన కార్యదర్శి పాకనాటి సత్యనారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శులు చట్టుమాల దామస్, గుర్రం వెంకటేశ్వరరావు, కొండ పర్వహరినాథ్, కార్యదర్శులు షేక్ నాగూర్ వల్లి ముస్లిం మైనార్టీ, నక్కా శ్రీనివాసరావు, పల్లె ప్రకాష్ రావు, కోశాధికారి చిట్టి బోమ్మనాగలక్ష్మి చెక్కపల్లి గ్రామ కమిటీగా వీరిని చెక్కపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నియమించారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ పరిశీలకులుగా నక్కనబోయిన వేణు, బొద్దనపల్లి గ్రామ(సర్పంచి), దొండపాటి ఏసుపాదం ఈదర(సర్పంచి), మాజీ తెలుగు యువత అధ్యక్షుడు నలజాల హరిబాబు, మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్, కందుల పిచ్చయ్య, కాటేపల్లి శ్రీనివాసరావు చెక్కపల్లి (సర్పంచి) తల్లిబోయిన సత్యనారాయణ, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాటేపల్లి ప్రసాద్, కాటేపల్లి నాగేశ్వరరావు, టిడిపి పెద్దలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్కూల్స్, కాలేజీ బస్సులు ఫిట్నెస్ కలిగి ఉండాలి

రవాణా శాఖ అధికారులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
మండలంలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ప్రయివేట్ స్కూల్స్, కాలేజీ బస్సులు ఫిట్నెస్ కలిగి ఉన్నాయో లేదో రవాణా శాఖ అధికారులు బుధవారం పరీక్షించారు. స్కూల్స్, కాలేజీల వేసవి సెలవులు అయ్యే సమయానికి బస్సులు పూర్తిగా ఫిట్నెస్ కలిగి ఉండాలని స్కూల్ యాజమాన్యాలకు రవాణాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఎవరైనా నిబంధనలు మీరితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ మండల కమిటీ నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి జారీచేసిన జిల్లా మండల కమిటీల నియామక పత్రాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు నూజివీడు కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పరిమిసాగర కుమార్, కార్యదర్శులుగా గోపే మురళీబాబు, మల్లెల వెంకటేశ్వరరావు, నల్లిపోయిన వీర రాఘవులు, కార్యాలయ కార్యదర్శిగా అబ్బు దాసరి రమేష్‌లను నియమించారు. ఆగిరిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా బేకిరి రాజు, చాట్రాయి మండల అధ్యక్షులుగా అమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు అలియాస్ చంటి, ముసునూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా సూర్యదేవర వెంకట వరప్రసాద్, నూజివీడు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా యార్లగడ్డ ఆంజనేయులును నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ కాంగ్రెస్ మాత్రమే దేశంలోని అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల, అన్ని మతాల ప్రయోజనాలను కాపాడగలదని, 2029లో కాంగ్రెస్‌ను అధికారంలో తేవడానికి నూతన కమిటీ సభ్యులు తీవ్రంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరీదు కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి.డి.రవి కుమార్, టి.విటల్ కుమార్, పల్లె పాము ప్రసాద్, రాచపోలు నాగేశ్వరరావు, అల్పార్ భాషా పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులకు జరిమాన

ప్రజాశక్తి - చాట్రాయి
మండలంలో విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు బుధవారం విద్యుత్ వినియోగదారుల మీటర్లను తనిఖీ నిర్వహించారు. 2,660 విద్యుత్ మీటర్లను తనిఖీ నిర్వహించగా మీటర్ లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులు ఏడుగురికి రూ.98 వేల జరిమానా విధించారు. అదనంగా లోడు వాడుతున్న 210 మంది వినియోగదారులకు రూ.అరు లక్షల 92 వేల జరిమానా విధించారు. కేటగిరీ మార్పు వాడుతున్న వినియోగదారులు 29 మందికి రూ.93 వేల అపరాధ జరిమానా విధించడం జరిగిందని విజిలెన్స్ అధికారి విజయకుమారి, నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ, విస్సన్నపేట డిఇఇ పి.సోమశేఖరరావు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ మీటర్లను జరిమానాలు విధించి సర్వీస్ పెట్టడం జరిగిందని, రెండోసారి అక్రమ విద్యుత్ వినియోగించినట్లయితే విద్యుత్ చట్టప్రకారం కేసులు పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ సంజయ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెళ్లికెళ్తే ఇల్లు దోచేశారు..

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - పోలవరం
తాళాలు వేసుకుని బంధువుల పెళ్లికెళ్తే ఇల్లు లూటీ చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం పోలవరం పంచాయతీ జగన్నాధపేట గ్రామంలో జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం గ్రామానికి చెందిన నల్లమిల్లి శ్రీను కుటుంబ సమేతంగా రాజమహేంద్రవరం పెళ్లికి వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడం, బీరువా తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలవరం సిఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ నేర ప్రాంతానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. బీరువాలో ఉంచిన 27.75 కాసుల బంగారం, 4 కేజీల వెండి, రూ.8.60 లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం
కొయ్యలగూడెం సమీపంలోని బిఇడి కళాశాల వద్ద నేషనల్ హైవేపై బుధవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాల పాలయ్యారు. కృష్ణా జిల్లా గంపలగూడెం గ్రామం నుంచి కాకినాడ పెళ్లి చూపులకు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఇందులో ఒకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కొయ్యలగూడెం పిహెచ్‌సి తరలించారు.

నేటికీ కాలువలు, చెరువుగట్లపైనే..!

గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు, భూముల వ్యవహారంలో అవకతవకలు
అధికారులు మారడంతో ఇళ్ల స్థలాలపై అగమ్యగోచరంలో లబ్ధిదారులు
పేదల సొంతింటి కల నెరవేరేనా?


తహశీల్దార్ కార్యాలయం వద్ద గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - ముసునూరు
నివాసం వుండటానికి జానెడు జాగా లేక చెరువులు, కాలువ గట్లపై, రహదారి మార్జిన్‌లలో పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వైసిపి హయాంలో మండలకేంద్రమైన ముసునూరు గ్రామంతో పాటు వలసపల్లి, ఎల్లాపురం గ్రామాల ప్రజలకు ముసునూరు నుంచి వలసపల్లి వెళ్లే రహదారి దగ్గరలో సంజపువాగు పక్కన ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో ప్రజలు నిరాకరించారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు ఆ మూడు గ్రామాలతో పాటు మండలంలోని మరికొన్ని గ్రామాల్లోని గ్రామస్థులు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, ఇంటి బిల్లుల చెల్లింపుల కోసం పడిగాపులు కాస్తున్నారు. గత 17 సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇళ్ల స్థలాలకు వ్యవసాయ భూములు కొనుగోలుకు లబ్ధిదారుడు దగ్గర నుంచి కొంతమేర నగదు వసూలు చేసి మిగతాది ప్రభుత్వం భరిస్తుందని అప్పటి నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో భూములు కోనుగోలు చేసి పేదలకు ఇచ్చే సమయంలో మొదటి విడిత ముగిసింది. రెండో విడత వచ్చేసరికి రైతులకు డబ్బులు ఇవ్వలేకపోవడంతో రైతులు ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే మా స్థలాలు ఇళ్ల స్థలాలకు ఇస్తామంటూ కోర్టుకు వెళ్లారు. నగదు కట్టిన లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యాన కోర్టుకు వెళ్లి రెండు, మూడు దఫాలు కోర్టులో గెలిచి, లబ్ధిదారులకు నివాస స్థలాల మంజూరుకు ఆమోదం వచ్చింది. మరలా భూ యాజమానులు మాకు లబ్ధిదారులు ఇచ్చిన నగదు చాలదంటూ, ప్రభుత్వం ప్రకటించిన నగదు ఇవ్వాలంటూ మరలా ఆపై కోర్టుకు వెళ్లగా స్థలాల మంజూరు ఆపేశారు. దీంతో లబ్ధిదారులు అగ్రిమెంట్ ప్రకారం ఆ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం వుంటున్నారు. కాని పక్కా నిర్మాణాలు జరగలేదు. అప్పటి నుంచి రెండు, మూడు దఫాలు ప్రభుత్వాలు మారాయి. కానీ పేదలకు ఇవ్వాల్సిన నివాస స్థలాల మాట అలాగే వుండిపోయింది. కరెంట్, నీళ్ళు, మౌలిక వసతులు లేకుండా గత 15 సంవత్సరాల నుంచి అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. తరవాత వచ్చిన టిడిపి ప్రభుత్వం లబ్ధిదారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదు. అనంతరం వచ్చిన వైసిపి మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు టిడిపి ప్రభుత్వంలో బిల్లులు ఇవ్వని ఇళ్లకు నేను ఇస్తానంటూ గృహనిర్మాణ శాఖాధికారుల ద్వారా నివేదిక తీసుకుని నేటి వరకు ఆ బిల్లులు మంజూరు చేయకపోవడం గమనార్హం. అనంతరం వచ్చిన టిడిపి ప్రభుత్వం నూతన ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్క ఇంటికి రూ.3 లక్షలకుపైగా నిధులు మంజూరు చేస్తానని చెప్పి ఆ ఇళ్ల నిర్మాణంపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పేదోడి సొంతింటి కల కలగానే మిగిలిపోయే పరిస్థితి వుందని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల స్థలాల మంజూరుకు ఆమోదం తెలపడంతో పాటు నూతన గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

వినోదాత్మకంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


ఏలూరు సిటీలో..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ
జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఎంతో వినోదాత్మకంగా 14వ రోజుకు చేరుకున్నాయి. ముందుగా బుధవారం గ్రంథాలయ సిబ్బంది బివిఎస్.లక్ష్మి విద్యార్థుల చేత నీతికథల పుస్తకాలను చదివించారు. కథల్లోని నీతిని విద్యార్థుల చేత వివరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ ఎం.ఆశ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో, క్రమశిక్షణతో ఎలా మెలగాలి, జ్ఞాపకశక్తి మెరుగుపరిచే విధంగా ఆటలు ఆడించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా క్లాసులు, క్విజ్ పోటీలు, వార్తా పత్రికలపై అవగాహన కల్పిస్తూ వక్తృత్వం పోటీలు నిర్వహించారు. భవిష్యత్తులో మీరందరు ఎంతో ఉన్నత స్థాయికి చేరాలంటే వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తరచూ గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి సందీప్ కుమార్, ఎండి అస్లాంపాషా, విద్యార్థులు పాల్గొన్నారు . **ఏలూరు :** వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయంలో యంగ్ మార్షల్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ శ్రీవేణుగోపాల శ్రీనివాస్, బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్, సాయి కుమార్ డాన్ 1 చే స్వీయ రక్షణలో మెలకువలు, సెల్ఫ్ డిఫెన్స్‌లో రకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.మురళీకృష్ణచే కమ్యూనికేట్ ఇన్ ఇంగ్లీష్, లెక్చరర్ ఎం.రమేష్ బాబుచే మ్యాజికల్ మాథ్స్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కారంశెట్టి రమేష్ బాబుచే పంచతంత్ర నీతికథలు, క్లాసులు నిర్వహించబడ్డాయి. గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణ గురించి గ్రంథాలయ నిర్వహకురాలు ఎం.శోభ విద్యార్థులకు తెలియజేశారు. విరామ సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు.
కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, పుస్తక సమీక్షతో పాటు కథలు చెప్పడం జరిగిందని శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


కలిదిండిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


సూరేపల్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి : ఎఒ

ప్రజాశక్తి - ముసునూరు
రైతులందరూ పంట మార్పిడి విధానం అలవర్చుకోవాలని, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ముసునూరు మండల వ్యవసాయాధికారి సూరిబాబు అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై ఎంటి.కాంతమ్మ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ సూరిబాబు ప్రకృతి వ్యవసాయ రైతులను దుశాల్వా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలుగల పిల్లలను బడిలో చేర్పించాలి : ఎంపిడిఒ

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చదువులో తప్ప వేరే రంగాల్లో పనిచేయరాదని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు కార్యక్రమం ఈనెల 14 నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు డిఎం.వెంకటలక్ష్మి నారాయణ, జె.నాగమల్లేశ్వరితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ముగ్గురు యువకుల మృతిపై మంత్రి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
కాలకృత్యాల కోసం కోసం చెరువు వద్ద దిగి ముగ్గురు యువకులు మృతి చెందడంపై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వెల్లడించారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమడోలు మండలంలోని పెదలింగంపాడులో వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో కాలకృత్యాల కోసం కోమటిగుంట చెరువు వద్ద ఆగి భీమడోలు మండలం కోమటిగుంట చెరువులో ప్రమాదవశాత్తు ముగ్గురు యువకులు మునిగి మృతి చెందడంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
మానవ సమాజం అభివృద్ధి చెందాలంటే దేశాన్ని దోచుకునే కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారుల ప్రభుత్వాలు పతనం అవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని అశ్వరావుపేట రోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయంలో సిపిఎం శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకు జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట్రావు అధ్యక్షతన వహించగా.. ప్రారంభ సూచికగా పార్టీ జెండాను మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్ రావు ఎగరవేశారు. మండల కార్యదర్శి జీవరత్నం కార్యకర్తలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సైదాంతిక రాజకీయ శిక్షణా తరగతులలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెట్టిందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కారు చౌకగా అమ్మేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన జరిగే సమ్మెను కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో మండల కమిటీ సభ్యులు యాగంటి సీత, జోడే సూర్యచంద్రరావు, టి.నర్సాపురం మండల కమిటీ సభ్యురాలు బుద్దుల గంగాభవాని, పార్టీ సభ్యులు ఎం.బాలరాజు, ఎం.అశోక్ కుమార్, ఇ.నరసరావు, పి.దుర్గా పాల్గొన్నారు.

తాగునీరందించండి మహాప్రభో..!

ప్రజాశక్తి - చింతలపూడి
తాగునీరు ఇవ్వండి మహాప్రభో అని ప్రగడవరం పంచాయతీ మరియమ్మ పేట వాసులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ మరియమ్మ పేట గ్రామంలో పది రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 రోజుల నుంచి రిపేర్ కోసం తీసిన మోటర్‌ని బుధవారం వరకు బిగించని పరిస్థితి నెలకొంది. 10 రోజుల నుంచి తాగునీరు లేక అల్లాడుతుంటే.. అధికారులు మాత్రం స్పందించటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామస్తులు అధికారులను అడగగా ఇంకా రెండు రోజులు పడుతుందని చెబుతున్నారని, నీరు లేక ఇబ్బందిపడుతున్నామని తెలియజేశారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.


మోటర్ తీసేసిన అధికారులు

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నిడమర్రు
ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. మండలంలోని పరిశ్రమలు, ఆక్వా షాపులు, వ్యాపారులు, బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల్లో బుధవారం సిఐటియు బృందం పర్యటించి సమ్మె నోటీసు అందజేసి, సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్సును ప్రవేశపెట్టిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20న సమ్మెకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, కోన శ్రీనివాసరావు, సంకు నాగశ్రీను, లింగబలి లక్ష్మణరావు, వెలిశెట్టి నాగ శ్రీను, బాలవాసు ఉన్నారు.
నూజివీడు టౌన్ : నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి సిఐటియు తరఫున బుధవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలోకి మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు వెళుతున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యం అన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు, అవుట్‌సోర్సింగ్, కార్మికసంఘ నాయకులు జయలక్ష్మి, రజిని, యేసు, గోవిందు, శ్యామల పాల్గొన్నారు.
లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేల సాధనకై 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు అన్నారు.

సారా రహిత జిల్లాకు అవిశ్రాంత కృషి

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్ స్పష్టం

నూజివీడు టౌన్ : జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నాటుసారాను పూర్తిగా అరికట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్ స్పష్టం చేశారు. నూజివీడు పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయంలో నవోదయం 2.0 రివ్యూ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి నవోదయం 2.0 అనే కార్యక్రమం ద్వారా సారాను పరిపూర్ణంగా అరికట్టేందుకు విస్తృతమైన దాడులు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా పరిధిలో నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం నియోజకవర్గాలతో పాటు భీమడోలు మండలం ద్వారకాతిరుమల గ్రామంలో సారా ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో మొత్తం 142 గ్రామాల్లో సారా తయారీ క్రయవిక్రయాలు కొనసాగుతుండగా విస్తృతదాడుల నేపథ్యంలో 120 గ్రామాల్లో సారా పూర్తిగా అదుపు చేసినట్లు చెప్పారు. సారా తయారీ క్రయవిక్రయాల నుంచి బయటకు వచ్చిన వారికి ఉపాధి కల్పించే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నూజివీడు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిఆర్‌డిఎ, ఇండస్ట్రియల్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం కొనసాగుతుందన్నారు. జిల్లా నుంచి ఇందుకోసం 244 మంది, నూజివీడు నియోజకవర్గం నుంచి 13 మందిని గుర్తించినట్లు చెప్పారు. ఈ సంఖ్య మరో 30-40 మంది పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. డిఆర్‌డిఎ, ఇండస్ట్రియల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశం ద్వారా వివిధ దశల్లో ఉపాధి కల్పించడం, రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. విస్తృతమైన దాడులు నిర్వహించడం ద్వారా ఏ గ్రేడ్‌లో ఉన్న ఆరు గ్రామాలలో ఐదు గ్రామాలు పూర్తిగా సారాను మానివేసినట్లు చెప్పారు. చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామంలో సారా ఆనవాళ్ళు ఉన్నట్లు గుర్తించామన్నారు. బి కేటగిరిలోని 6 గ్రామాల్లోనూ పూర్తిగా సారా కంట్రోల్లో ఉన్నట్లు తెలిపారు. సి గ్రేడ్‌లో ఉన్న 35 గ్రామాలకు గాను 32 గ్రామాల్లో సారాను పూర్తిగా మానివేసినట్లు తెలిపారు. ఇక్కడ చాట్రాయి మండలంలోని చిన్నంపేట, కోటపాడు, చనుబండ గ్రామాలలో సారావిక్రయాలు కొనసాగుతున్న సమాచారం ఉందన్నారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వారు 800 మందిని బైండోవర్ చేసామన్నారు. నూజివీడు సర్కిల్ పరిధిలో 315 మందిని బైండోవర్ చేయగా ఇందులో గత రెండు నెలల్లో 200 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. నవోదయం 2.0 లక్ష్యాలు నూరు శాతం నెరవేరగానే మత్తు పదార్థాలపై దృష్టి సారిస్తామని వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి ఏలూరు నగరంలో గల జిల్లా ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ ద్వారా ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తంగేళ్లమూడిలోని దేవి డి అడిక్షన్ సెంటర్లో నెలరోజులపాటు చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న మాజీ డిసిసిబి ఛైర్మన్

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం
మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో జరిగినటువంటి ఏజెన్సీ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఏజెన్సీ రాయల్ చాలెంజర్స్ బుట్టాయిగూడెం టీమ్‌కి రూ.50 వేల బహుమతి మాజీ డిసిసిబి ఛైర్మన్ కరాటం రాంబాబు అందజేశారు. రన్నరఫ్ టీమ్‌కి రూ.30 వేల బహుమతి కోటనాగవరం మాజీ పంచాయతీ సర్పంచి మొడియం సింగరాజు, మూడవ బహుమతి రూ.20 వేలు పోలవరం టీమ్‌కి జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు అందజేశారు. కరాటం రాంబాబు ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క టీంకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ బహుమతుల ప్రధానంలో కరాటం ఉమామహేశ్వరరావు, ఎస్ఐ దుర్గమహేశ్వరరావు, మొడియం సింగరాజు, పాయం అరుణ్ కుమార్, కొండేపాటి రామకృష్ణ, మెట్ట బుచ్చిరాజు, జిఎస్ఎన్.నాయుడు, బుట్టాయగూడెం సర్పంచి తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా క్రీడా స్ఫూర్తితో ఇలా ముందుకు సాగి మరిన్ని విజయాలు అందుకోవాలని తెలియజేశారు.

ఉపాధి హామీ చట్టం అమలుపై సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు సిటీ
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో డ్వామా పీడీ వెంకట సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పింఛన్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఉపాధి హామీ చట్టం అమలుపై, వేసవికాలం దృష్టిలో ఉంచుకుని శ్రామికుల పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని, శ్రామికులకు తాగునీరు, నీడ, వైద్య సౌకర్యాలు వంటి అవసరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ స్కూల్‌లో చదరంగం పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
జంగారెడ్డిగూడెంలోని ప్రతిభ స్కూల్‌లో బాలబాలికల జిల్లా అండర్-11 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో బాలురు విభాగంలో ఎడ్ల జ్యోతి స్వరూప్, కుకునూరి తస్విన్, బాలికల విభాగంలో ఎడ్ల ప్రేమ రక్షిత, ఇషిత సాయిశ్రీలు విజయం సాధించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ కన్నా సూర్యానాగేశ్వరావు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో విజయం సాధించిన నలుగురని ఈనెల 24, 25 తేదీల్లో గుంటూరులో జరిగే 11 స్టేట్ ఛాంపియన్ షిప్‌కి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ స్కూల్ ప్రిన్సిపల్ సరోజినీ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అడక్‌కమిటీ వారికీ కృతజ్ఞతలు తెలిపారు.

బాల ఆధార్ నమోదుకు చర్యలు

ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
5 సంవత్సరాల లోపు పిల్లలందరికి ఆధార్ నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదుపై పంచాయతీ, అంగన్వాడీ, సచివాలయ, మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 176 మంది పిల్లలకు ఆధార్ నమోదు చేయించలేదని, వారిని గుర్తించి ఆధార్ నమోదు కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయించేలా కృషిచేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మీ దేవమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళ పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.